# ఇంద్రధనుస్సు



సుమిత్ర కుర్చీలో కూర్చుని ఉంది. ఆమె ఎదుట బల్లమీద తను ఉద్యోగంకోసం పెట్టిన దరఖాస్తుకు జవాబుగా తనను ఇంటర్వ్యూకు రమ్మని వ్రాసిన పిలుపు పడిఉంది. ఆమెలో ఇన్నాళ్ళూ అణిగిఉన్న ఆలోచనలు విజృంభించాయి. ఆవేశం కలుగుతున్నది. నిర్ణయంకోసం ఘర్షణ జరుగుతున్నది.

ఆ రోజూ—ఒక రోజున—

"నేను కొనిపెట్టేవరకూ ఆగకపోతే నువ్వే

కొనుక్కో. స్త్రీలకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలంటావుకదా?" అన్నాడు ఆనందరావు—సుమిత్ర భర్త.

అతడి వచనంలో దరహాసం ఉంది. ఆ హాసంలో పరిహాసం ఉంది. సుమిత్ర అతడి ముఖంలోకి చూసింది — నిదానంగా, పరీక్షగా, అతడిని కదిలించాలి అన్నట్లుగా. కాని, గాలి తాకిడికి కదిలే గడ్డిపోచ మాత్రాన్నైనా ఆ చూపులు అతడిని కదిలించలేదు. జేబులో చేయివేసి, రెండవ చేతితో క్రాఫు సరిదిద్దుకుంటూ, బూటు అడుగులు ధీమాగా పడుతుంటే బయటికి నడిచాడు.

పైకి చల్లగా, నిండుగా సాగిపోయే ప్రవాహంలో అంతరంగా ఎన్నో ఎదురీత సాగిస్తున్న చిన్న ప్రవాహాలు, సుడిగుండాలు ఉంటాయి. అతడి పరిహాసం తనను ఆనందపు సరిహద్దులను దాటించి అధః పాతాళానికి తొక్కివేస్తుంది. తను ఇంత ఆవేశపడుతూ, మనసు ఎదురు తిరుగుతూ కూడా ఎందుకు సహిస్తుంది? చిన్నప్పటినుంచీ అన్నీ సహించటమే తనకు అలవాటయింది. ఈ సంప్రదాయం స్త్రీని ఆ విధంగా పెంచుతుంది. నలుగురు ఉండే కుటుంబపు ఆర్థిక పరిస్థితిలోని కష్టసుఖాలను అవగాహన చేసుకుని, యూనివర్సిటీలో చదవాలనే కోరికను అణచుకుని పెళ్ళికి సిద్ధపడింది.

తను వదిన చెల్లెలి పెళ్ళికి వెళ్ళింది. స్టేషనుకు కారు వచ్చింది. కారు ఇంటిదగ్గర ఆగగానే బంధువులు కొంతమంది వచ్చి మూగారు. తను కారు దిగుతూ, డోర్ పట్టుకుని ఉన్న అతడిని చూసింది. అతడు నవ్వుతూ వదినను పలకరిస్తూ, తనను చూశాడు. బలంగా, పొడవుగా, అందంగా ఉండి చక్కని దుస్తులలో, చిరునవ్వుతో ఉన్న అతడు అప్పుడే తనను ఆకర్షించుకున్నాడు. తరువాత తన మనసులోని ఇష్టాన్ని వదినకు సూచించింది. చివరకు సంబంధం నిశ్చయమయింది. ఈ వివాహం జరిగింది.

అందమైన ముఖాలవెనక సంస్కారాన్ని, చిరునవ్వువెనక స్వభావాన్ని ఎవరు చదవగలరు?

చదువు ఉంది. మంచి ఉద్యోగం ఉంది. లేనిది ఏమిటి? ఈ కాలపు యువకుల సంస్కారం అందంగా దుస్తులు ధరించటం, సరదాగా తిరగటం దగ్గర ఆగిపోతున్నది. చదువుకున్న యువతులు కూడా అంతే ననుకోవటంలో పొరపాటు పడుతున్నారు.

ఆడపిల్లల అలంకరణ వెనక వ్యక్తిత్వం, సంస్కారం నిలబెట్టుకోవాలనే అభిమానం ఉంది. ఆడపిల్లల సరదాలవెనక సమానత్వం నిరూపించుకోవాలనే ఆరాటం ఉంది. ఇది యువకుడు గ్రహించకపోవటంవలన యువతిలో ఈ రెండూ దెబ్బతింటూనే ఉన్నాయి. ఇంకా స్త్రీ స్వాతంత్ర్యం, సమానత్వం స్థిరపడలేదు, మగవాడి హక్కులలాగా. ఇంకా పోరాటం సాగుతున్న పరిస్థితే. ఎప్పటికి వస్తుంది మార్పు? స్త్రీ

పెనుతుఫానుల తాకిడిని కూడా తట్టుకొని నిలబడగల శక్తి మహా వృక్షాలకు కాదు, చిన్ని గడ్డిమొక్కలకు ఉంది అవి తలవంచగలవు. తలవంచడం బలహీనతకు తార్కాణం కాదు: నిజమైన బలం సూచించేది మాత్రమే అన్నిటికన్న మిన్నగా ప్రేమించినవారి సుఖం, శాంతి కాంక్షించి ఆత్మార్పణ చేసుకొనే శక్తి ఎంతటి మహత్తరమైనదో ఎలా చెప్పడం?

పరిహాస పాత్రురాలుగా పరిగణించబడటం పోయి, ఎప్పుడు గౌరవించబడుతుంది?

సంసారం ప్రారంభించాక ఇద్దరిమధ్యా అనేక భేదాభిప్రాయాలు వస్తూ ఉండేవి. తను అతడి ఇష్టాయిష్టాలను గమనించి అనుగుణంగా ప్రవర్తించేది. అతడు తన ఇష్టాలను గుర్తించినా, తెలియనట్లే ప్రవర్తించేవాడు. అది తనకు బాధ కలిగించేది. అయినా సహించి, తన ఇష్టాలను ప్రకటించటం నేర్చుకుంది— అతడికి దూరం కాకుండా సుముఖుడుగా చేసుకోవాలనే ఉద్దేశంతో. అయినా అతడినుండి నిర్లక్ష్యమూ, పరిహాస వచనాలే ఎదురుకావటంతో, తనలో నిరాశా నిస్పృహలు కలిగాయి. అతనికి తనయెడల ప్రేమాభిమానాలు లేవనే నిశ్చయానికి వచ్చేసింది. అతనిని ఏదైనా అడగటానికి అభిమానం అడ్డువచ్చేది. కోరికలను అణచుకోవలసి వచ్చేది.

స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి అనుకునేది. ఆ మాటే అతడిదగ్గర కూడా అంది. అది అవకాశంగా తీసుకుని పండగకు చీర అడిగినా, సరదాకు ఒక వస్తువు అడిగినా "కొనుక్కో" అనేవాడు అతను. అది తన అభిమానాన్ని దెబ్బగొట్టేది. ఏదైనా ఉద్యోగంచేసి తన అవసరాలు, కోరికలు తీర్చుకోవాలనే గాఢమైన ఆశయం; అతడి డబ్బు వాడుకోవటం, అతడిని ఒక కోరిక కోరటం అంటే విపరీతమైన జుగుప్స కలిగేవి. కారణం ఒక చీరకాదు. వ్యక్తిత్వాన్ని కోరుతున్న స్త్రీ హృదయంలో ఆవేదన. అభిమానానికి జరిగిన పరాభవం.

ఆ కారణంగానే, ఆ ఆవేశంలోనే ఆ రోజు ఉద్యోగానికి దరఖాస్తు పెట్టింది తను.

అతడికి తనపై ప్రేమాభిమానాలు లేవనుకుంటే 'బతుకు ఎందుకు' అనిపించేది. 'అనురాగం కరువయి పురుషుడి అహంకింద అణిగిపోవలసి ఉంటే స్త్రీకి మిగిలిన త్రోవ ఆత్మహత్యే కదా?' అనుకునేది. ఆ నిస్పృహలో "నాకు తృప్తిగాలేదు. ఎక్కడికైనా వెళ్ళిపోవాలనిపిస్తుంది" అనేది— అప్పటికైనా తన ఆవేదనను అతడు అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాడేమోనన్న ఆశతో. కానీ అతడికి కోపం వచ్చేది.

"నీకు ఇక్కడ తృప్తి లేకపోతే నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళు. మీ అమ్మదగ్గర ఉండు" అనేవాడు.

అతడు అన్నట్లు తను అనగలదా? ప్రేమాభిమానాలు లేకపోయాక, కలిసి ఉండటంలో అర్థం

శ్రీమతి ఎ. ఎస్. మణి

ఏమిటి? పండగకు పుట్టింటికి వెళ్ళింది. అన్నయ్య అడ్వకేటు. మాటలలో అన్నయ్యతో విడాకుల ప్రస్తావన ఎత్తింది.

"ఆయన నా వ్యక్తిత్వాన్ని గుర్తించరన్నయ్యా. ప్రతిదీ పరిహాసమే. నా మాట ఏదైనా నిర్లక్ష్యమే. సామరస్యం ఎట్లా కుదురుతుంది? సంసారం ఎట్లా సాగుతుంది?" అంది.

అన్నయ్య నవ్వాడు.

"ఇవి అందరి సంసారాల్లోనూ ఉంటాయమ్మా. మీ వదిన మాట కాదనని అందరూ నన్నుచూసి నవ్వుతారుకదే? పరిహాసంగా అన్నానంతే. పెళ్ళి అయ్యాక విడాకులు ఇవ్వటానికి మన కేం హక్కు ఉంది? మనమంతా ఈ లోకానికి ఎప్పుడో ఒకనాడు విడాకులు ఇవ్వవలసిన వాళ్ళమే. సహించటం నేర్చుకుంటే చాలా సంగతులు చక్కబడతాయి" అన్నాడు.

చివరకు తను చేసింది సహించటమే. సహించటం సంగతి అటుంచి, అన్నయ్య మాటలు వింటుంటే మనసులో గగుర్పాటు కలిగింది. ఈ లోకం, స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ పురుషుల సమానత్వం — ఈ విషయాలను అధిగమించి, బతుకు అంతటికీ విలువైన ప్రేమ మాధుర్యాన్ని దూరం చేసుకోబోయినట్లు భయం వేసింది. జన్మ జన్మాగతమైన బంధాన్ని ఛేదించజూసినట్లు పశ్చాత్తాపం కలిగింది. ఆ క్షణాలలో అతడి సాన్నిధ్యంలో ఉండాలని, భర్త తనను గాఢంగా వాంఛించాలని, తను అతడి లాలనలో ఓలలాడాలని కోరిక అలలెత్తి తన త్రికరణాలనూ చుట్టివేసింది.

క్షణికావేశాలు ఎటువంటి నిర్ణయాలకు దారితీస్తాయి! ఒకసారి దూరమయ్యాక తిరిగి కలుసుకోగలరా! కలుసుకోక నిలవగలరా! ఈ ఆరాటం అతనిలో కూడా ఉంటే తనకు బాధ ఎందుకు? ఇంత మథన, మమత మనసులో పెట్టుకుని తిరిగివచ్చిన తనకు లభించిన ఆదరణలు నిర్లక్ష్యమూ, పరిహాసమూను. ఒకటే ప్రశ్న తలఎత్తుతుంది. 'ఎందుకు సహించాలి?'

భర్త ఆదరాభిమానాలు లభించనప్పుడే స్త్రీకి చెప్పలేని దుఃఖం కలుగుతుంది. ద్వేషం రగులుతుంది. వివేకాన్ని కోల్పోతుంది. ఇది తెలియక కొంతమంది పురుషులు తమ ఆధిక్యం చూపడానికి స్త్రీలలో ద్వేషం, అహం, అసూయ రెచ్చగొడుతుంటారు. స్త్రీ పురుషులలో ఎవరు ఎక్కువ; ఎవరు తక్కువ? ఇద్దరివీ ఉత్తమమైన బాధ్యతలే. ఒకరు లేక ఇంకొకరు తృప్తి, సంతోషాలతో బతకలేరు. ఇది అర్థం చేసుకున్న భార్యాభర్తలు సుఖజీవనం సాగించగలరు. కానీ ప్రపంచం

మొత్తంమీద ఈ సుఖ జీవనం ఎప్పుడైనా స్థిర పడుతుందా? ఊహూ. ఇది పరస్పరాకర్షణలో సాగే నిరంతర సంఘర్షణ.

ఈనాడు స్త్రీ చదువుకుంటున్నది. సంపాదనార్హతను కూడా కలిగిఉంది. కనుక పురుషుడు గౌరవించటం నేర్చుకుంటున్నాడు. కానీ స్త్రీ తను కోరుకుంటున్న సమానత్వం, గౌరవం లభిస్తే తృప్తిపడుతుందా; తన ఆధిక్యం నిరూపించుకోజూసి పొరపాటు చేస్తుందా? విడాకులూ, స్త్రీ ఆర్థిక స్వతంత్రతా ఈ సమస్యకు సమాధానాలు కావు. ఇవి స్త్రీ మమకారాన్ని, అవసరాలను తీర్చలేవు. పురుషుడు మాత్రం స్త్రీ లేకుండా జీవించగలడా? పురుషుడిలో మార్పు రావాలి. ఆమె ఆవేదననూ, ఆశయాన్నీ అతడు గుర్తించాలి. ఆ రోజు ఎప్పటికి వస్తుంది? ఆ వరప్రసాదాన్ని స్త్రీలు ఎప్పుడు సద్వినియోగం చేసుకుంటారు?

స్త్రీ ఎప్పుడో మోహ వాగురలో చిక్కుకుని తన జీవిత సర్వస్వాన్ని పురుషుడికి అప్పగించింది. ఆధిక్యం కోల్పోయింది. సమానత్వానికి అవకాశం జారవిడుచుకుంది.

ఆ స్త్రీకి వారసురాలు తను!

ఇప్పుడు ఆ సమానత్వంకోసం, వ్యక్తిత్వపు ఆధిక్యంకోసం పోరాడుతున్నది. ఈ విషయం అతడికి తెలియజెయ్యాలి. అతడి కెంత చులకన! ఉద్యోగం చెయ్యలేననే, డబ్బు సంపాదించలేననే ఊరుకుందా తను? అతడికి పరిహాసం. అది తన బతుకునే పరీక్షకు పెడుతుంది. తను సమస్యలో చిక్కుకుని నిర్ణయంకోసం అల్లాడిపోతుంది. తనకు ఉద్యోగం వస్తుంది. కానీ ఇద్దరు పిల్లల తల్లి, గృహిణి—తను మాట పట్టింపుతో ఉద్యోగంలో చేరుతుందా? అందులో వివేకం ఉందా? కానీ అతడికి తెలియజెయ్యాలి, తను బలహీనురాలు కాదని. స్త్రీని అనేక విధాలుగా వర్ణిస్తారు—మాతృమూర్తి, శాంత స్వరూపిణి, ప్రేమదేవత అని. కానీ— అన్నీ వరాలూ కలిసి ధవళమయినట్టు, అన్ని అనుభూతులూ తనలో జీర్ణించుకుని సహనశీలి అయింది స్త్రీ. పట్టకను తాకి వికిరణంపొంది తేజఃకిరణం రకరకాల రంగులు పొందినట్టు, ఒక్కొక్క సంఘటన ఆమెలో అనేక రసానుభూతులను ప్రకోపింపజేస్తుంది. ఆ సమయంలో ఇంద్రధనుస్సు స్త్రీమూర్తి. కోపం, ప్రతీకారం, జుగుప్స, ద్వేషం ఉన్నప్పటికీ—ప్రేమ, సహనం, శాంతం అనే తేజస్సులో ఒదిగిపోతున్నాయి.

# ఇంద్రధనుస్సు

మబ్బులు రావటం, రంగులు మారటం అతడికి తెలియదు. అతడు చూసేది కేవలం నీలాకాశాన్నే.

తను శాంతశీలి, సహనమూర్తి అనుకుంటాడు. బలహీనురాలుగా భావిస్తాడు. కానీ తను అది కాదు.

దుఃఖం వరదలై ప్రవహించే కన్నీటి నది; ఆవేశంతో ఉరికిపడే జలపాతం; ద్వేషంతో కాటు వేయబోయే తాచుపాము—ఒక్కొక్క వేళలో తన మనసు.

కానీ తను ప్రతిఘటించదు. అన్నీ సహిస్తుంది. తన తృప్తి ఆశయాలు ఏమైపోయినా ధర్మానికీ, ప్రేమకూ, పిల్లలకూ తను దూరం కాలేదు. అన్యాయం చెయ్యలేదు.

రెండు చేతులలో ముఖం దాచుకుంది సుమిత్ర. బరువయిన హృదయం, ఆర్ద్రమైన కళ్ళతో నిశ్చయానికి వచ్చింది.

భర్త ఆనందరావు వచ్చేటప్పటికి అట్లాగే కూర్చుని ఉంది. వస్తూనే అతడు బల్లమీదఉన్న ఇంటర్వ్యూ పిలుపు చూశాడు.

"ఓహో, ఉద్యోగం చేస్తావా? నీకు దొరుకుతుందిలే. చదువుకున్న దానివి. ఈ కాలం మగవాళ్ళకు దొరకటం కష్టం కానీ, ఆడవాళ్ళకి ఎవడైనా పిలిచి ఇస్తాడు" అంటూ దానిని అడ్డంగా, నిలువుగా చింపి కిటికీలోనుంచి బయటకు విసిరాడు. ఆమెవైపు తిరిగి పరిహాసంగా చూశాడు. అతడి పెదవులమీద నవ్వు ఆమెలో ప్రతీకారాన్ని రెచ్చగొట్టింది. అది బుసకొట్ట సాగింది. 'ఎందుకు సహించాలి?' అనే ప్రశ్న తలఎత్తింది.

అతడు దగ్గరగా వచ్చి "నువ్వు నాకు దూరం కావాలని చూస్తున్నావు" అన్నాడు.

సుమిత్ర అతడి ముఖంలోకి చూసింది. అంత కోపంలోనూ ఆమెకు నవ్వు వచ్చింది. అంతే కానీ అతడు అసలాగా 'నువ్వు దూరమైతే నేను బతకలేను' అనడు. అదే కాబోలు, స్త్రీ పురుషులకు తేడా!

అనురాగానికి అహం అడ్డువస్తుంది. అహం తొలిగితే కానీ అనురాగం స్థిరపడదు. తనలో అహం తొలిగిపోయింది. ఈ ఆలోచనలతో క్షాళితమయిపోయింది. ఇంక అతడిలో తొలగాలి' అనుకుంటుంటే ఆమె మనసు శాంతించింది.

నవ్వుతూ అంది: "బ్రహ్మదేవుడు స్త్రీని సృష్టించి పురుషుడికి ఇచ్చాడుట, ఒంటరిగా ఉన్నాడని. బతకటాని కొక సమస్య కావాలి! స్త్రీని ఏమంటే సృష్టించాడంటే—సృష్టి అంతా పూర్తి కాగా, ఆకాశం, పూవులోని సౌకుమార్యం, వజ్రంలోని కఠినత్వం, వెన్నెలలోని చల్లదనం, గాలిలోని చంచలత్వం. ...."

అతడు అడ్డువచ్చి "ఇది అందరికీ తెలిసిన కథే" అన్నాడు.

"తెలియని కథ లేమున్నాయి? సృష్టి మొదలుకుని అన్నీ సరికొత్త పాత కథలే. 'స్త్రీని భరించలేను, తీసుకో' అన్నాడుట పురుషుడు. 'స్త్రీని సహించలేకపోయినా, వదిలి అసలు ఉండలేవు. నీవే తీసుకువెళ్ళు' అని పంపించివేశాడుట బ్రహ్మ.

"మిమ్మల్ని వదిలి ఉండలేనని నేను ఒప్పుకుంటున్నాను. నన్ను విడిచి ఉండలేనని మీరు అనలేరా? అట్లా చింపివెయ్యటం నన్ను రెచ్చగొట్టడానికా? ఉద్యోగం వద్దు. నీకు నేను దూరం కాలేను' అని చెప్పలేరా? అప్పుడు ఈ ఉద్యోగం కాదు, నేను వదులుకోనిది ఏమిటి?" అంది సుమిత్ర కుర్చీలోనుంచి లేచి.


ఆనందరావు ఆమెకు దగ్గరగా వచ్చాడు.

"నువ్వు తెలివైనదానివి. నిన్ను విడిచి నేను ఉండలేనని వేరే చెప్పాలా, సుమిత్రా?" అన్నాడు.

విప్పారిన నేత్రాలతో అతడిని చూస్తూ సుమిత్ర "ఔను. చెప్పాలి" అంది. ఆ క్షణాలలో ఇద్దరి హృదయాలూ తాదాత్మ్యం పొంది ఉంటాయి.

"నువ్వు నాకు దూరం కావటానికి వీల్లేదు, సుమిత్రా!" అన్నాడు అతడు గాఢంగా ఆమె తలను తన వక్షానికి అదుముకుంటూ. సుమిత్రకు మనసు నిండా నవ్వు వచ్చింది—'అతడు ఇంకా ఒప్పుకోడు' అని. మనసు మారినా మాట మారదు. కానీ ఈపాటికి అతడికి అర్థం అయి ఉంటుంది. సుమిత్ర బలహీనురాలై లొంగిపోలేదు. 'లోక కల్యాణ ప్రదాలయిన ప్రేమ, శాంతి, తృప్తి కోరి లొంగిపోవటంలో అందం ఉంది; ఔదార్యం ఉంది' అనుకుంటూ చిరునవ్వుతో "ఔను. వీల్లేదు" అంది, అతడి కౌగిలిలో ఒదిగిపోయి.

ఆ చిరునవ్వు ఆమె గుండెలో కోటి దీపాల కాంతులను ప్రసారం చేసింది. ★




చిత్రం—వై. ఎస్. ప్రసన్నరావు (విజయనగరం)